


# హెండ్లరు పెళ్ళి

వి.యస్. భారతి

ఓ మోస్తరు ఎత్తు. చాయనచాయ. కాంతిగల కళ్లు, తీరైన ముక్కు. చూడాలనిపించే మొహం ఆమెది. ఆ అమ్మాయికి యిరవై ఏళ్లు. చదువుకున్నది. ఆర్ట్సు కాలేజీలో పాసయింది బి.ఏ. చదువు మానేసి రెండేళ్ళయింది. రెండేళ్ళనుంచి ఎప్రంటిస్ చేస్తోంది పెళ్ళి కూతురుగా.

ఆ అమ్మాయి పేరే కమల.

'కమల బుద్ధిమంతురాలు' అంటుంది వాళ్ళ నాయనమ్మ.

'మంచి పిల్ల మా కమల' అనుకుంటుంది వాళ్ళమ్మ.

'పాతకాలపు దానిలా వుంటుంది మన కమల' అనుకుంటారు వాళ్ళ నాన్న.

'వెర్రిమొహం. దీని కీచదువువృథా. నోట్లో మాటలేదు. బుర్రలో ఆలోచన లేదు' అనుకుంటుంది భారతి—అంటుంది భారతి.

కాదనదు కమల. అవుననీ అనదు.

భారతి కమలకన్న ఎత్తు. పచ్చగా వుంటుంది. తళతళలాడే కళ్ళు. మిల మిలలాడే కాటుక పెట్టుకుంటుంది. చిన్ననోరు. చక్కనిముక్కు. చూస్తూనే వుండాలనిపించే మొహం ఆమెది. బి. యస్సీ. పాసయింతర్వాత అమ్మా, నాన్నా, అమ్మమ్మలతో వాదించి, దెబ్బలాడి, చివరికి గెలిచి ఎమ్మెస్సీలో చేరింది.

'దేవాంతకురాలు యిది' అనుకుంటుంది కమల నాయనమ్మ.

'గడుగ్గాయి మా భారతి' అనుకుంటుంది కమల అమ్మ.

'వేగడం కష్టం. పెంకిపిల్ల యిది' అనుకుంటారు కమల నాన్న.

'మంచిపిల్లని నేను. నేనింకా చదవాలి. ఉద్యోగాల్చేసి ఊళ్ళు ఎలా తినేను' అనుకుంటుంది భారతి. పైకి అనదు.

కమలకి భారతి పిన్ని అవుతుంది. భారతి కమల తల్లికి చెల్లెలు. వాళ్ళ నాయనమ్మకి కోడలు చెల్లెలు. వాళ్ళ నాన్నగారికి మరదలు...

ఆరోజు ఆదివారం తర్వాతి రోజు. కమల నాన్నగారు ఆఫీసు కెళ్ళలేదు. శలవు పెట్టారు.

కమల పెళ్ళి కూతురయింది, కమల నాయనమ్మ ఆధ్వర్యంలో ఆవిడ కోరిక ప్రకారం.

పెళ్ళికూతురు కమల — కాదు పోలేరమ్మ కమల.

భారతి కమలని చూసింది...

కాళ్ళని పట్టెలు. రెండువందల యాభై రూపాయల పట్టు చీర. ముప్ఫయిరూపాయల వెల్వెటు జాకెట్టు పువ్వుల జడ-జడగంటల జడ. బంగారు గాజులు—బంగారు వడ్డాణం. చెవుల్లో బంగారం, చెంపలపై బంగారం, పాపిట్లో బంగారం, జబ్బలపై బంగారం కమల నా వేళ అంతగా చూడా లనిపించడంలేదు.

తెల్లని జార్జెట్ చీర కట్టుకుని, నల్లటి టెర్రికాటన్ బ్లౌజ్ తొడుక్కుని మెడలో ఓ సన్నగొలుసు వేసుకుంది భారతి. భారతి మొహంమీదనుంచి కళ్లు తిప్పాలనిపించడం లేదు.

కమల్ని చూసి సంతృప్తిగా మెటికలు విరుచుకుంది నాయనమ్మ.

నెత్తి మొత్తుకుంది భారతి. కమల బి. యే. సమాధానంగా నవ్వలేదు. మొత్తుకోనూలేదు. స్తబ్ధుగా కూర్చుంది




అవతల హాల్లో కమల నాన్నగారు ఓ సోఫాలో కూర్చున్నారు. వాళ్ళమ్మ గారు గుమ్మం దగ్గర నిలబడింది. ఆవిడ చెంగు భుజంచుట్టూ తిరిగి నోటి దగ్గర ఆగింది. అందరూ నిశ్శబ్దంగా ఆలోచించుకుంటున్నారు. వీధిలో టాక్సీ ఆగింది. కమల నాన్నగారు వాచీతో మాట్లాడారు. పన్నెండు పి. యమ్. అంది వాచీ. పెళ్ళికొడుకు కరెక్ట్ టైమ్ కొచ్చాడు. కమల నాన్నగారు వీధిలో కెళ్ళారు. పెళ్ళికొడుకుతో లోపల కొచ్చారు.

భారతి •ఇవతల కొచ్చింది. వచ్చి చూసింది.

పెళ్ళికొడుకు ఆరడుగు లెత్తుంటాడు. బరువు నూటయాభై ఎన్మి దుండవచ్చు. రంగు నేషనల్. కళ్ళు పెద్దవి కావు. నోరు ఫరవాలేదు. ముక్కు దృఢంగా వుంది. పళ్లు చిన్నవికాదు. మిలిటరీ మీసం. సివిల్ గడ్డం. నల్ల పంట్లాం- టెరిలీను. తెల్ల స్లాకు-టెర్రికాటన్.

భారతి భయపడింది. గడుగ్గాయి భారతి, ఎమ్మెస్సీ భయపడింది. 'రా...వ...ణా...సు...రు...డు' అనుకుంది. ముక్కుమీద వేలేసుకుంది. వేసుకు తీసేసింది. తీసేసి లోపలి కెళ్ళింది.

'వచ్చారా!' అన్నారు కమల నాన్నగారు.

'వచ్చాను' అన్నాడు రావణుడు.

'కూర్చోండి' అన్నారు కమల నాన్నగారు.

'కూర్చుంటాను'-రావణుడు.

'భారతీ! కాస్త కాఫీ టిఫిన్‌లు' అన్నారు కమల నాన్నగారు.

'మీ అమ్మాయి పేరు కమల అన్నా రనుకుంటాను.'

'అవును. భారతి—మా మరదలు పేరు.'

'వెరీగుడ్!' అన్నాడు రావణుడు.

పైన కోరబడిన సరుకులు పట్టుకుని అక్కడ కొచ్చింది భారతి. దడదడ లాడుతూ వచ్చింది భారతి గుండె.

'మా మరదలు భారతి.'

'వెరీగుడ్!'

'ఇతను రామారావు.'

'కాదు రావణాగావు ఎండ్ వెరీ బాడ్' భారతి పైకి అనలేదు. నవ్వుదా మనుకుంది. నవ్వలేదు.

కమల నాన్నగారు లోపల కెళ్లారు అమ్మాయిని తెమ్మని చెప్పడానికి.

'భారతీ!' అంది వాళ్ళ అక్క.

'నేను తీసికెళ్ళను' అంది భారతి.

'మా అమ్మవు కదూ!' అంది అక్క.

'కాదు. మీ చెల్లాయిని' అంది భారతి.

వెనకటికో పెళ్ళికొడుకు చూడ్డాని కొచ్చి, తల్లినికాదు కూతుర్ని పెళ్ళి చేసుకుంటానూ అన్నాడు. అప్పుడు భారతి సత్యభామైరాగా, పెళ్ళికొడుకు నరకాసురుడై పరాభవం చెందాడు. ఆ ఉదంతం తలలో మెదిలి రావణా సురుడ్ని పీచమడచింది. స్త్రీ కాదే అను కుంది భారతి. అయినా తప్పే దేముం దని నడుంబిగించింది. కమల చెయ్యి పట్టుకుంది.

ముందు కమల, భారతి. వెనక కమల ఫాదరు, ఆ వెనక మదరు కదిలారు.

'తనంతట తను రాలేదా?' అన్నాడు రావణాసురుడు.

భారతి ముక్కుపుటా లెగరేసింది. కమల రెప్పలు దించుకుంది. కమల నాన్నగారు కళ్ళజోడు తీసి తుడుచు కుంటున్నారు. మదరు ఇంట్లోకి వెళ్ళింది, ముక్కుమీద వేలేసుకొస్తుం దుకు. వాళ్ళ నాయనమ్మ ముక్కుమీద వేలేసుకునే కూర్చుంది లోపల.

కమల కూర్చుంది నాన్నగారి ప్రక్కన.

కమల ప్రక్కన నిల్చుంది భారతి.

గుమ్మం ప్రక్కన నిల్చుంది భారతి అక్క.

'మీ రందరూ లోపలి కెళ్ళండి కమల తప్ప' అన్నాడు రావణుడు.

కమల నాన్నగారు మాట్లాడలేదు. ఆయన ఎత్తు ఐదడుగుల ఆరంగుళాలు. బరువు నూటయిరవై ఒకటి.

'మీ మరలుకూడా ఉంటుంది' అన్నాడు మళ్ళీ రావణుడే.

భారతి 'నే నుండను' అంది స్వగ తంగా.




అక్కడే వుండిపోయింది కమల ప్రక్కన ప్రకాశంగా. మిగిలిన వాళ్ళు లోపల కెళ్ళిపోయారు. వెళ్ళి ఊపిరి పీల్చుకున్నారు తేలిగ్గా:

'ఇలా నగలు దిగేసుకుని కూర్చోడము నాకు గిట్టదు. నీ కిష్టమా?'

కమల మాట్లాడలేదు.

"మీ కిష్టమా?"

'లేదు' భారతి జవాబు.

'అయితే వెళ్ళి కాస్త సాయం చెయ్యండి తనకి. వెళ్ళి ఓ మామూలు చీర అవీ వేసి తీసుకురండి క్విక్!' ఆజ్ఞ అయింది.

కమల, భారతి లోపలకెళ్ళారు. కమల నాన్నగారు బయటకొచ్చారు.

'ఇదేం పెళ్ళి చూపులురా!' అంది కమల నాయనమ్మ. కమల అమ్మ ఏమీ అనలేకపోయింది.

భారతికి వళ్లుమండుతోంది రావణా సురిడివంక చూడ్డంకాని, మాట్లాడ్డం గాని చెయ్యలేకపోతోంది. అందుకని మరింత వళ్ళుమండుతోంది.

కమల అర్ధవివస్త్ర అయింది. జడ పువ్వులు కోల్పోయింది, చాలామటుకు బంగారం తొలగించబడింది. నీలం టెర్లిన్ చీర, తెలుపు టెరీకాట్ బ్లౌజ్ వేసుకుని 'సవస్త్ర' అయింది.

కమలను చూడ బుద్ధౌతోంది.

'కమలా! నాకు వళ్లుమండుతోంది. ఏవిటా మనిషి? ఏవిటాగొప్ప? బుద్ధావ

తారంలా మాట్లాడవేం నువ్వసలు?' భారతికి వళ్ళు మండుతూనేవుంది. కమల బుద్ధావతారంలాగానే వుంది.

కమల, భారతి హాల్లోకి, కమల నాన్నగారు లోపలికి చేరారు.

రావణాసురుడు కమల కాళ్ళకేసి చూచాడు. భారతి చూసింది. గబుక్కున అందెలు తీసేసింది క్రిందికొంగి. లోపల హడావిడిలో వాటి సంగతి మర్చిపోయారు.

ఇద్దరూ కూర్చున్నారు.

'ఆ కాఫీ తాగండి.'

భారతి, కమల సందేహించారు.

రావణాసురుడు సందేహించలేదు.

'తొందరగా కానివ్వండి' అన్నాడు కటువుగా.

హాల్లోనే ఓ మూలగా బల్ల, దాని మీద చక్కగా మెరుస్తున్న వీణ ఉన్నాయి.

అతను కమలకేసి, వీణకేసి చూశాడు.

కమల భారతికేసి, భారతి కమల కేసి చూశారు.

'వీణ వాయించు'.

కమల లేచింది.

వాయించ వలసిందేమిటో అతనే చెప్పాడు.

కమల వాయించింది.

'సంగీతం వెలగ బెట్టావుటోయ్!' అనుకుంది భారతి.

'అలా బయట కెళ్ళిరావాలి. మీ నాన్నగార్తో చెప్పు' అన్నాడు రావణుడు. 'మీరు రావాలి' అన్నాడు. భారతితో.

'రానక్కరలేదు' అనుకుంది భారతి. అలాగని పునరుద్ఘాటించుకుంది.

కమల లోపలికి వెళ్ళింది. లోపలికి వెళ్తూన్న కమలని చూసి, కమల వీపు చూసి, 'పాతపద్ధతి' అన్నాడు రావణాసురుడు. భారతి తల వంచుకుని ముక్కు పుటా లెగరేసింది కోపంగా.

కమల గదిలోకి వచ్చింది. కమల ఫాదర్ కూడా వచ్చారు.

రామారావు లేచాడు. భారతి లేచింది.

'బజారు కెళ్ళొస్తాం' అన్నాడు రావణాసురుడు.

'బాగుండదు' అనలేక పోయారు కమల నాన్నగారు. ఆయన ఎత్తు ఐదడుగుల ఆరంగుళాలు. ఆయన బరువు నూటయిరవై ఒకటి!

ముందు అతను, వెనక కమల, ఆ వెనక భారతి బయటకెళ్లారు.

'ఆడపిల్ల ల్నిద్దర్నీ పరాయి మగాడితో పంపడమా!' అంది కమల నాయనమ్మ.



'అవును! పంపడమా?' అంది కమల అమ్మ.

'అవును! పంపడంవే!' అన్నారు కమల నాన్నగారు.

'పిల్లిలా మాట్లాడవేంరా నువ్వు ?' గదిమింది కమల నాయనమ్మ.

'అవునండీ మాట్లాడరేం?' రెట్టించింది కమల అమ్మ.

కమల నాన్నగారు మాట్లాడలేదు.

అతనొచ్చిన టాక్సీలో వెళ్తున్నారు భారతి, కమల, అతను. వెనక సీట్లో అతను–సగంపైగా అతను. ఆ ప్రక్కన కమల–కమల బరువు తొంభై పౌన్లు–కమల ప్రక్కన తొంభై రెండు పౌన్ల భారతి.

అలా కూర్చునే ఏర్పాటు అతనే

కాడు. భారతి కిష్టంలేదు. ఇష్టం నేలేదు.

'...నేను ఎమ్మే పాసయ్యాను. ఆ ర్వాత ఎన్మిదేళ్ళుగా మిలిటరీలో ుంటున్నాను, నేను క్యాప్టన్ని. నాకు డవాళ్లు ఆడవాళ్ళుగా వుంటేనే ష్టం. ఇల్లూ, వాకిలీ చక్కగా ంచుతూ, జీవితం ప్రశాంతంగానే ాగేట్టుచెయ్యడం, పిల్లల్ని చక్కగా పెంచడం ఆడవాళ్ళ పని అని నా మ్మకం.'

('అలాగనే అంటాడు హిట్లరు' నుకుంది భారతి).

'ఇప్పుడు నేను బెంగుళూరులో ుంటున్నాను. నాకు ప్రొద్దునే లేవగానే ెడ్ కాఫీ తాగడం, ఎన్మిదింటికి బ్రేక్ ాస్ట్, ఒంటిగంటకి లంచ్ అలవాటు. ాయంత్రం క్లబ్‌కి వెళ్ళి రాత్రి ొమ్మిది, పదిగంటల కొస్తుంటాను. నేనింటి కొచ్చేసరికి ఆడవాళ్లు నిద్ర ోతూ, ఆవలిస్తూ కూర్చుంటే నాకు విరాకు...ఇక్కడ ఆపు...'అన్నాడు హిట్లరు.

టాక్సీ ఆగింది. జల్ జల్ రామ్ గోల్డు షాపు ముందు ముగ్గురూ దిగారు.

ఓ ఉంగరం కొన్నాడు హిట్లరు. చాలా అందంగా వుంది.

'మంచి సెలక్షనే!' అనుకుంది భారతి.

ఓ క్షణం తీరికదొరగ్గానే, 'కమలా నే నింకా ఈ మనిషిని భరించలేను. నాకు కడుపుడికిపోతోంది – ఆ దర్పం ఆ పొగరుచూస్తే!...మరి అలా మీద వాలి పోతాడేం టాక్సీలో. నా మీదకి వాలన్నా కూర్చోవే నువ్వు' అంది.

గోల్డు షాపులోంచి బట్టల షాపు కెళ్లారు. నూరురూపాయలు పెట్టి ఓ చీర కొన్నాడు హిట్లర్లు. చాలా బాగుం దని ఒప్పుకుంది భారతి. అక్కడ్నించి జనరల్ స్టోర్సు కెళ్ళి వెడ్డింగ్ కార్డులు కొన్నారు.


కొని ఆగారు. ఆగి టాక్సీ ఎక్కారు.

'...నాకు ఆడంబరాలు గిట్టవు. సింపిల్‌గావుంటే చాలాయిష్టం. నేను ఎమ్మే చదివే టప్పుడు మా క్లాసులో మోహిని నే అమ్మాయుండేది. చాలా అందంగా వుండేది. మీ పిన్నికన్న కూడా అందంగా వుండేది.'

(భారతికి వళ్ళు మండింది)

'అయితే ఎంతో గర్వంగా, ఫాషన బుల్‌గా వుండేది. నాకు ప్రపోజ్ చేసింది. కాని ఐటర్న్డ్ డౌన్ హార్ ఆఫర్...'

హిట్లరు మాట్లాడ్డం జరుగుతూనే వుంది. టాక్సీ వెళ్తూనే వుంది. ప్రతి నిమిషం భారతి కోపం పెరుగుతూనే వుంది. ఆమె మాట్లాడలేక పోతూనే వుంది.




కమల స్తబ్ధుగానే వుంది. ఆమె కను బొమలు ముడివడ్డాయా అని అనిపించింది భారతికి

హిట్లరో నిమిషం ఆగాడు...కమల యిల్లుదగ్గర కొస్తోంది.

'ఇంకా పెళ్ళికి ఒప్పుకోడం జరగ లేదు. ఏమీకాలేదు. ఏమిటి చనువు? ఏమిటీ అధారిటీ.' అనుకుంది భారతి.

'కమలా!' అన్నాడు హిట్లరు.

ఉలిక్కిపడింది భారతి.

'ఈ హిట్లరుతో కమల ఎలా వేగ లదు?' అనుకుంది భారతి.

'క...మ...లా...' అన్నా డ

కమల తలెత్తింది.

హిట్లరు అన్నారు - 'నీతో పెళ్ళి ఒప్పుకుంటున్నాను.'

భారతి ఊపిరి బిగపట్టింది.

హిట్లరు ఉంగరం తీశాడు.

'మీతో పెళ్ళికి నేను ఒప్పుకోట లేదు' అంది కమల. అలాగని కమ అంది!

హిట్లరు తెల్లబోయాడు.

భారతి తెల్లబోయింది.

కమల తెల్లబోలేదు.

'...మీతో పెళ్ళికి నేను ఒప్పుకోటం లేదు. మీ రొక సర్వెంటునో, ఓ భోగం వాన్నో కట్టుకుంటే, డబ్బుకోసం మీ వాడమన్నట్లు ఆడి పడుంటుంది. అందుకు నే తగినదాన్ని కాదు' అంది కమల.

హిట్లరు మరింత తెల్లబోయాడు.

భారతి పాలిపోయింది.

కమల చామనఛాయగానే వుంది.

'టాక్సీ! అవు!' అంది కమల.

'మీ రివ్వాల్సిన డబ్బు ఇచ్చి టాక్సీ తెగండి. మేం ఇంటికి పోతాం' అంది కమల.

హిట్లరు తేరుకుంటున్నాడు. భారతి కూడా తేరుకుంటోంది.

'కానీ కమలా...ఐయామ్ సారీ!' అన్నాడు హిట్లర్.

'అండ్ ఐయామ్ సారీ టూ: ప్లీజ్ గెటౌట్' అంది కమల.

హిట్లరు మరి మాట్లాడలేదు. దిగి పోయాడు. చీరపొట్లం, వెడ్డింగ్ కార్డ్స్ అందించింది కమల. అందుకున్నాడు రామారావు.

టాక్సీ కదిలింది. రామారావు కదల్లేదు.

'కమలా...నాకు చాలా గర్వంగా ఉంది. నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. బాగా చేశావు. పొగరు...ఎంత పొగరు! ఆడాళ్లంటే ఎంత అలుసు!' అంది భారతి. కమలను ముద్దుపెట్టు కుంది. కమల మాట్లాడలేదు.

'యూ ఆర్ ఎ మార్వెల్. ఆర్ యూ నాట్ కమలా' అంది భారతి.

'ఐయామే హర్ట్యామన్ బీయింగ్... థాంక్స్ టు రామారావ్' అంది కమల.

టాక్సీ వెళ్తూనే వుంది.

'ఏమయ్యారో పిల్లలు' అంది కమల నాయనమ్మ.

'అవును ఏమయ్యారో!' అంది కమల అమ్మ.

'ఏమౌతారా!' అనుకున్నారు కమల నాన్నగారు.

కమల, భారతి టాక్సీ దిగారు...

'దేవాంతకురాలివే' అంది కమల నాయనమ్మ.

'గడుగ్గాయివి కదే!' అంది కమల అమ్మ.

'ఎంత ధైర్యమే!' అన్నారు కమల నాన్నగారు. ఆయన బరువు......

లెంపలేసుకుంది భారతి.

కమల స్తబ్ధుగావుంది.

— —